# ౪ శృంగార శ్రేష్ఠి

శృంగారశ్రేష్ఠి అనంబడే యొకానొక వైశ్యకులావతంసుడు వైశాలీనగరమందు గాపురంబుండేడు. అతణ్ణి ప్రజాసామాన్యం 'అంగారః, ఇంగాలో, ఇంగలం'' అని వైయాకరణులు మార్చి చెప్పేలా 'శృంగార శ్రేష్ఠి' అనలేక 'సింగారప్పు చెట్టి' అనీ మఱీమార్చి 'సీంమిరప సెట్టి' అని పిలువడం కద్దు.

ఈ మార్పు సరైందా అక్షరాల కక్షరాలే ఎగిరిపోయినవని ఏవైయాకరణుడైనా అడిగేటట్టయినా, ఆ ప్రజలిట్టే సమాధానం చెప్పగల సమర్థులు. ఏమని ? "మిరపలో కారంలేదా ?" అని సెట్టి మిరపకాయ లమ్మడా అని —— ఏదైనా తచ్ఛ్రేష్ఠికి 'సీంమిరప సెట్టి' అని తన్నెవరన్నా గానీ కోపంలేదు. ఉడుకుమోత్తనం లేదు. ఆ పేరుయొక్క ఆది సంస్కృతమైన 'శృంగార శ్రేష్ఠి' అనే నామంతో తాను పిలవబడాలనే బింకం లేదు. పంకం లేదు. ఇంతెందుకు 'సీంమురప సెట్టి' అనేదే సొంత పేరనీ, ఎవరైనా 'శృంగార శ్రేష్ఠి' అంటే అదేదో అని అతగాని నమ్మకం. —— ఈ వితర్కింపు అనవసరం కూడాను. ఎవరూ 'శృంగార శ్రేష్ఠి' అని అతణ్ణి పిలిచినవారే లేరు. అంతా 'సీంమిరప సెట్టి' అని పిలవటమే పరిపాటి.

ఒకమా ఱోయాచకపండితుడు పై శ్రేష్ఠివద్దకు సంభావనకై వచ్చి యడిగి యడిగి విసిగివేసారి సాహుంకారుగారేమీ ఇయ్యకపోతే 'నీసొమ్ము పణ్యస్త్రీలకేగాని మాబోటి పుణ్యాత్ములకు గాదు కాబోలు' అన్నాడు. సీంమిరపసెట్టి చివాలునలేచి "పణ్యస్త్రీలకూ లేదు. పుణ్యాత్ములకూలేదు. నా సొమ్ము నాదే పోవయ్యా! బాపనయ్యా! నీమాత్రం సంస్కృతం నాకు రాదనుకున్నావు గామోసు! పణ్యస్త్రీ అంటే బోగందేనా? నావొంక సూసే బోగందెవరూ? ఉప్పూ సింతపండూ అమ్ముకుండే సెట్టి ముండా కొడుకుని" అన్నాడు. లోపలకు బొడ్డుపోనిచ్చి గొంతు అదో బొంగురు మ్రోతెత్తేటట్టు.

సరే అని ఆ యాచకుడు వెళ్ళిపోయినాడు. వెళ్ళిపోయి యాయూర మరో వీథినిబోతూ చక్కని ఓ బోగందానింటికి వెళ్ళి సంభావన తీసికొని "శాస్త్రులుగారూ పురాణం కొంచం సెలవియ్యండి వినాలనివుంది" అని అంటే "అస్తివైశాలీ నగరే శృంగారశ్రేష్ఠి వైశ్యః" అని చదివేడు. బోగంది "మా వూళ్ళో శృంగారశ్రేష్ఠి పేరున్న వైశ్యకుల శిఖామణే? ఎప్పుడూ కళ్ళారచూడలేదండీ? వింతగానుంది" అంది. అని శ్రేష్ఠి ఇల్లూవళ్లూ ఆనవాలుగా తెలిసికొంది. తెలిసికొని లోలోపల "సీంమిరప శెట్టి యింతవాడా? శృంగార శ్రేష్ఠా?" అని యుబ్బిపోయి పండితుణ్ణి పంపించివేసి తానెలాగన్నా సీంమిరపశెట్టిని తన వలలో పడేసుకొని శృంగారం మాట ఎలావున్నా శ్రేష్ఠి సిరికొల్లగొని పెద్దమేడ కట్టా లనుకుంది.

బోగందో మామోలు లంగా కట్టుకుని యుత్తప్పు డగపించే సామాన్యపు దానిలాగు ఎవరూ అట్టె తనకేసి చూడనిమచ్చుగా, చిల్లఱ దుకాణం మీదికి శొంఠికొమ్ము కొనుక్కోవడానికి వెళ్ళినట్టుగా వెళ్ళింది

శ్రేష్ఠికొట్టుకు. శ్రేష్ఠి కూర్చుని యున్నాడు తన అరిగరిగిపోయిన ముక్కాలిపీటమీద నిట్టేట్టే జాఱుతూ. సరుకు లందుకొంటూ అందఱికీ అడిగినవాళ్ళకు లేదనకుండా యేదో యొక పొట్లం కడుతూ, యేదో నూని డొక్కతో ఎగతోడుతూ. బోగంది సెట్టి కొట్టు దగ్గరకొచ్చి "ఒక డబ్బువి వేలగ్గింజలిస్తురూ సెట్టిగారూ !" అంది. "ఆఁ ఆఁ అబ్బో ! సానిగారు మా కొట్టుకొచ్చారు. సొంతంగా వచ్చారు. తాంబూళంలోకా యేంటి వేలగ్గింజలు —గింజలేం ? కాయలట్టుకెళ్లు" అన్నాడు. బోగంది "మీరేం కట్టిస్తే అవే పట్టుకెళతాను — కాని సెట్టిగారూ ! మిమ్మల్నీ దాకా సీం మిరపసెట్టిగారనే అనుకొన్నా. శృంగార శ్రేష్ఠిగారు కూడానే!" అంది. "ఊఁ ! ఊఁ ! ఎవరు సొప్పారు ? బుల్లీ ! నీ కెవరు సొప్పారు !" అన్నాడు సెట్టి. బోగంది "ఒకరు సొప్పడమెందుకు ? తెలదూ ? మీ ముఖంలో శృంగారచేష్ట విరిసిపోతూంది" అంది. "ఊఁ ! ఊఁ !" అని కళ్ళు చికిలించుకొని శ్రేష్ఠి తులమున్నర ఏలక్కాయలు పొట్లంకట్టి బోగందానికిచ్చి "పట్టుకెళ్లు. పట్టుకెళ్లు" అని ఆ చేయి తాకుతూమా పరవశమైపోయి 'వెళ్లు' అన్నాడు. లోపల్నుంచి సెట్టి భార్య చూస్తూ "డబ్బులు పుచ్చుకోవడం మఱచిపోయినారా అమ్మిదగ్గఱ" అంది. సెట్టి వేశ్యను "చిన్నమ్మీ" అని వెనక్కి పిలచి "డబ్బులీలేదేం ?" అన్నాడు. వేశ్య అంది "మీ కొట్టు దగ్గరకొస్తేగాని నాకు మీరు సరుకు ఇచ్చినారా ? ఆలాగా మా యింటికొస్తేగాని మీకు మా డబ్బులు రావు" అని అంది. అంటూ వెళ్ళిపోయింది.

సెట్టి భార్య లోపల్నుంచి గావుకేగ్గా "ఓలమ్మీ" అని పిలవడానికి నోరు తెరిచింది. కాని సెట్టి తనభార్య నోరు నొక్కి "అది బోగందే. కేకేయకే. నే పట్టుకొస్తాను డబ్బు లెలాగో నే పట్టుకొస్తా" నన్నాడు. సెట్టిభార్య "నీ తెలివి మండినట్టే వుంది. బోగంది వీధంట వెడుతూంటే

మగాళ్లు పిలవకూడదు గాని ఆడాళ్లు పిలవకూడదూ ?'' అంది. "నీవు పిలిచినా నాకోసమే అనుకుంటారే యెట్టిమొకమా !'' అన్నాడు సెట్టి. అని వారించి లోపలకు వెళ్ళదలిమాడు పెళ్ళాన్ని.

సెట్టెప్పుడు అదివఱకు బోగందానింటికి వెళ్ళేఱగడు. మళ్లీ బోగంది సెట్టికొట్టుదగ్గఱకు రాలేదు. సందెలిడత సెట్టి గోవతాడు మొల నెట్టుకుని, మురిడీగొలుసులు చేతులకుంచుకొని — రెండూ బంగారపు వస్తువులే - గంజిబిగి జల్తారుకండువా పైని వేసుకొని, ఆ బోగందానింటికి బయలుదేఱేడు. ఎవరన్నా "ఎక్కడికి సెట్టిగారూ గుమ్మగా వెడుతున్నారు ?'' అంటే బాకీలు వసూలు చేసుకోడానికి అంటూ వెళ్ళినాడు.

బోగంది తన వీధరుగుమీద అదో అందంగా కూచుంది. తలకట్టు "విగ్గు'' పాపిడల్లే తీసుకొని, అటూ ఇటూ విరబోసుకొని, మొగాన్ని పౌడరు వేసికొని, వల్లెవాటుగా ఉల్లిపొర చీరకట్టుకొని, రైకలేకుండా కూచుంది. సెట్టి అంతదూరాన్నుంచి చూసేడు. కళ్లు చీకట్లు కమ్మిపోయినాయి సెట్టికి. ఒకమాటు కళ్లు నలుపుకొని తనకేసి చూచుకొని దానికేసిచూచి ఆశ్చర్యపోయి "సెస్ ! దాన్ని, 'ఓడబ్బు బాకీవున్నావు నీవు'' అని అడగడమేమిటి అని అనుకున్నాడు. అనుకొని వెనక్కి తిరిగి, వచ్చినదారినే పోబోయినాడు. బోగంది "ఏం శ్రేష్ఠిగారూ ఆదాకా వచ్చి మళ్ళి పోతున్నారు !'' అంది. "పొద్దున్నడబ్బు'' అన్నాడు సెట్టి. "ఏలక్కాయల డబ్బేనా ?'' అంది. "ఊ ! మహ సెడ్డగాపకం నీకు సిన్నమ్మీ !'' అన్నాడు. "అయితే శ్రేష్ఠిగారూ ! పొద్దున్నే అడగాలనుకున్నాను — శ్రేష్ఠిగారూ ! నాపేరు చిన్నమ్మి అని ఎవరు సొప్పారు?'' అని అడిగింది బోగంది. "సొప్పేదేంటి. మా యింట్లోదాని ముందు నీవు సిన్నమ్మిలా కనిపించేవు నాకు. దానికి వాకరు సొప్పేదేంటి ? చూస్తే

తెలీదూ ?" అన్నాడు. "అయితే, డబ్బుకోసమే వచ్చిందీ ?" అంటూ లోపలకు తీసుకొనివెళ్ళి డబ్బు చేతిలో పెట్టి, "మా యింటికొచ్చారు. తాంబోళం సేవించరూ ?" అంది అని అరమోదాకుల్లో అన్ని వక్కలు, అన్నిలవంగాలు అన్ని ఏలక్కాయలు, జాపత్రి, జాజికాయముక్క, కవిరి, కాచు, అన్నీవుంచి ముందు బెట్టింది. సెట్టి గుండె తాళలే. ఒక్క "డబ్బు ఖరీదుగల ఏలక్కాయ లుచ్చుకుంటే దానికోసం తల్లడిల్లిపోయి వచ్చేరు. మాయింట ఏమీ లేవనా ? అయితేం లేండి. మీ డబ్బు మీకిచ్చేసి మీ ఋణాన్ని పడుండకుండా పైకి తేలేను" అంది బోగంది. అంటే సెట్టి "ఏలక్కాయలుంటే వుండేని. గంధంవుందీ ? అత్తరువుందీ !" అన్నాడు. బోగంది "గందంవుంది" కాని అని మురిడీగొలుసులకేసి గోవతాడుకేసి చూచింది. సెట్టి "ఈ వస్తువు లుచ్చుకుందామనే ? నీతస్సా గొయ్య ! నీతస్సాగొయ్య" అన్నాడు. బోగంది "కాదండీ ! గందం పూతకడ్డని" అంది. అయితే తీసి యెక్కడ వుంచుతావోవుంచు" అని సెట్టి తన ఆభరణాల్ని అదే తీసివేసేలాగు తనవాళ్ళాగ్గేసేడు. బోగంది గోవతాడు మురిడీగొలుసులు తీసి జాగ్రత్తగా వేశేవుంచి, సెట్టికి గందం పూస్తూంది. మైమఱచిపొయ్యేడు సెట్టి....బోగందింకా ఏమేంచెయ్యాలో అన్నీచేసింది.........అంతా అయిపోయినాక "ఎళ్ళొస్తా చిన్నమ్మీ !" అని మురిడీగొలుసులమాట గోవతాడుమాట పరాకుపడి యింటి కుత్సాహంగా వచ్చేసేడు.

సెట్టి యింటికి వచ్చేసరికి పండితుడు సెట్టి అరుగుమీద కూర్చుండి సెట్టిభార్యకు పురాణం చెబుతూ ఆఖరుకు వచ్చేసి "స్వస్తిశ్రీ పరిపాల యంతాం" అంటూ ఓ కొత్తకాసిమ్మన్నాడు. "సెట్టిభార్య ఉండండి మావారొస్తారు" అంది. అంతలో సెట్టి వచ్చాడు. "ఆ బోగందాని

అరువుడబ్బు ఈ బ్రాహ్మడికి విలియావేయండి. పట్టుకుపోతాడు" అంది సెట్టిభార్య సెట్టితో. సెట్టి "అదోసూలైందే. నాకే వసూలైందే" అంటూ డబ్బుకోసం మొలతడుముకుంటూ, మొలని తన గోవతాడు కానక, సెట్టి నిర్ఘాంతపోతూ ముచ్చెమట్లు గార్చేడు. అంతేనా ? నిలువునా ప్రాణా లొదిలేస్తూ వున్నాడేమో అన్నట్లు కొయ్యబారి పోయినాడు మనిషి. సెట్టి భార్య "ఏమండి పండితులవారూ!" అని అడుగబోతూ ఏడవబోతూ వుంటే పండితుడు "అస్తి వైశాలీనగరే చిన్నమ్మినామ్ని వేశ్యా" అన్నాడు. "అదే నా కొంపదీసిం" దంటూ సెట్టి గుండెపగిలి.

బ్రాహ్మణుడు అక్కడుంటే తనకు మాట దక్కదనుకొని లాభం చిక్కదనుకొని పోతూపోతూ, బోగంది, దానిగుమ్మంలో నిల్చునివుంటే– రాత్రిభాగం – "నాస్తి వైశాలీనగరే శృంగార శ్రేష్ఠి వైశ్యః" అన్నాడు. "ఏం" అంది బోగంది. "గుండెపగిలి పరమపదించేడు ఇప్పుడే" అన్నాడు బ్రాహ్మణుడు దానితో. "డాక్టర్లన్నమాటేనా?" అంది బోగంది. "కాకపోతే నీచేతుల నలా మెఱుస్తాయి శ్రేష్ఠి మురిడీ గొలుసులు ? నీ మొలనలా శ్రేష్ఠి గోవతాడూ?" అన్నాడు బ్రాహ్మణుడు. అంటూ దానివంక అదే చూపుగా జూచేడు ప్రాథేయపూర్వకంగా — బోగంది ఆనాడు తాను సంపాదించిన మురిడీగొలుసుల్లో వో గొలుసు ఆ బ్రాహ్మడికిచ్చి, రెండో గొలుసూ గోవతాడూ చెటిపించి సెట్టి పేర నో చంద్రహారం చేయించుకోవాలంటూ పండితుణ్ణి లోపలకు పిల్చుకొని ఓముద్దెట్టింది, "ఇందుకోసమేనా అలా చూచినావు?" అని. బ్రాహ్మణుడు 'చంద్రహారం నాపేర చేయించుకో"మని చెప్పడానికంటూ దాన్ని తిరిగి

ముద్దుపెట్టుకునేడు, "అవును పండితచంద్రా" అని బోగంది "హారము" అనకుండానే.

గుండెపగిలి–శృంగారశ్రేష్ఠి నిజంగా ఏమయేడో........పాపం !

| రచన | స్ఫురణ | తొలి ప్రకటనము |
| --- | --- | --- |
| 7—3—1931 | నరసాపురం | "వినోదిని" లో |